మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట





సీనియర్ జర్నలిస్టు మల్లు మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

# జర్నలిస్టుల సంక్షేమానికి నిధి

**ప్రతి నెల రూపాయలు లక్ష అందజేస్తా**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లోని కె.రఘురామయ్య ఆడిటోరియంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు సీనియర్ జర్నలిస్టులను సన్మానించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలవాలంటే మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారే జర్నలిస్టులని, వారి సేవలు సమాజానికి అమూల్యమని అన్నారు. జర్నలిస్టుల ఇళ్లు, ఆరోగ్యబీమా, గుర్తింపు కార్డులు, పింఛన్ వంటి సంక్షేమ అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి న్యాయమైన డిమాండ్లేనని, వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, సమాచార శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో జర్నలిస్టు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు. అందుకు సంబంధించి, ఈ నెల నుంచి, ప్రతి నెలా లక్ష రూపాయలు జర్నలిస్టు సంక్షేమ నిధికి అందిస్తానని ఆయన తెలిపారు.గత పాలనలో జరిగిన ఆర్థిక దుర్వినియోగాల వల్ల రాష్ట్ర ఖజానా సంక్షోభంలోకి వెళ్లిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజా సంక్షేమం విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ గుమాల్ మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు వాకిటి అశోక్,రాష్ట్ర నాయకులు డా. బండి విజయ్ కుమార్, నాయకులు జి.ఆశన్న ముదిరాజ్, మెట్టుకాడి ప్రభాకర్, బస్వరాజు, నర్సింహులు, గోపాల్, రమాకాంత్ రెడ్డి, యాదయ్య, మహబూబ్‌నగర్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

**నారాయణపేట,మార్చి 1 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు సెక్షన్ 30 పో లీస్ యాక్ట్ అమల్లో ఉంటుం దని జిల్లా ఎస్పీ డా .వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయ ని, పోలీసు అధికారుల ముం దస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు మరియు ప్రజలు గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వా హకులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగించే విధంగా సమావేశాలు ఏర్పాటు చేయడం, జనసమూహాలు గుమికూడేలా చర్యలు చేపట్టడం పూర్తిగా నిషేధమని తెలిపారు అలాగే సోషల్ మీడియాలో మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే లేదా శాంతి భద్రతలకు భంగం కలిగించే విష యాలను ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేయబడతాయని ఎస్పీ పేర్కొన్నారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హుల వుతారని తెలిపారు. నిషేధాజ్ఞల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని పోలీసు అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ డా. వినీత్ కోరారు.



జిల్లా ఎస్పీ డా. వినీత్


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సిఐ కె.ఎస్ రత్నం, కౌన్సిలర్ స్వాతి హరిబాబు

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకం

**జిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు**

**వనపర్తి, మార్చి 1 ప్రభాతవార్త :** నేరాలు నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సర్కిల్ ఇన్స్పెక్టర్ కే.ఎస్ రత్నం పేర్కొన్నారు. ఈ మేరకు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆదివారం. 11వ వార్డులో జిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.ఎస్ రత్నం పట్టణ ఎస్సై హరి ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ రిబ్బన్ కట్ చేసి సిసి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. వార్డులోని ప్రధాన కూడళ్ళలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా అవసరమని వార్డులో ఎలాంటి దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 24 గంటలు సీసీ కెమెరాల నిఘా ఉంటుందని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో దొంగతనాలను నియంత్రించవచ్చని ఆయన తెలిపారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఇదేవిధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడమే కాకుండా సాక్షాలను సేకరించినందుకు సీసీ కెమెరాల పాత్ర చాలా ముఖ్యమైనదని ఒక్క కెమెరా వెయ్యి -మిగతా3లో..

## పార్కును పరిశుభ్రంగా ఉంచాలి

**రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద పెద్ద పార్కును సందర్శించిన అదనపు కలెక్టర్**

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో శ్రీనివాస కాలనీలో రూరల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పెద్ద పార్కును ఆదివారం ఉదయం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. పార్క్ లో ఓపెన్ జిమ్,పిల్లల ఆట పరికరాలు విరిగి పోవడంపై అధికార యంత్రాంగం స్పందించారు. ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పార్క్ ను సందర్శించి మున్సిపల్ అధికారులకు పార్క్ ను పరిశుభ్రంగా సందర్శకులకు ఆహ్లాద పరిచేలా చర్యలు తీసుకోవాలని,ఓపెన్ జిమ్,పిల్లల ఆట,క్రీడా పరికరాలు వెంటనే విరిగిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు.


పార్కు సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# పేదల మోముల్లో చిరునవ్వు

**ఇందిరమ్మ ఇంటితో సొంతింటి కల సాకారం.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో/ హన్వాడ, మార్చి 1 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని, ప్రజా ప్రభుత్వంలో పేదల భూముల్లో చిరునవ్వు చూస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం ఎనిమిది తాండాలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి లబ్ధిదారుల ఆనందంలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు భద్రమైన నివాసం కల్పించడం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఆయన చెప్పారు. ఇది సామాజిక సమానత్వానికి నాంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీమిబాయి లింగమ్ నాయక్, ఉప సర్పంచ్ ఎన్.నరేష్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్యనిర్వహక అధ్యక్షులు చెన్నయ్య, కార్పోరేటర్లు ఎం. ప్రవీణ్ కుమార్, ఎస్ శేఖర్, యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవ రెడ్డి, ఎస్.విజయ్ కుమార్, మండల తహశీల్దార్ కిష్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**యాప్‌లో బుకింగ్ తో ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన**

**కల్వకుర్తి,మార్చి 1 ప్రభాతవార్త :** యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు యాప్‌లో బుకింగ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చివరస్తాలో రోడ్డుపై ఆదివారం బైఠాయించారు. సకాలంలో యూరియా దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం శి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. పంటకాలం దాటిపోతుంద ని యూరియా అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. యాప్ లో ఆన్ లైన్ లో కాకుండా పాత పద్ధతిలోనే అడిగిన ప్రతి రైతుకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటకు పైగా రైతులు రోడ్డుపై కూర్చోవడంతో వాహనాలు నిలిచిపోయాయి, సిఐ నాగార్జున అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ధర్నా విరమింపజేశారు.


రైతులతో మాట్లాడుతున్న సిఐ నాగార్జున

## ఎర్రకుంట జాడ ఏడ..?.

**కోట్ల విలువచేసే 6 ఎకరాల 15 గుంటల ఎర్రకుంట ఏమైనట్టు?**

**నిగ్గు తేల్చాల్సిన సంబంధిత అధికారులు మౌనమేల.?**

**బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ కమిటీ బాలానగర్ మండల అధ్యక్షులు కటికే మధు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్**


2015లో స్పెక్ట్రా వెంచర్ వారు చేయించిన ఎడి సర్వేలో 6 ఎకరాల 15 గుంటల భూమి ఎర్రకుంటగా చూపబడింది


మీడియా మిత్రులకు ఎర్రకుంటకు సంబంధించిన భూమిని చూయిస్తున్న కటికే మధు, శ్రీనివాసులు

**జడ్చర్ల (బాలానగర్), మార్చి 1 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో సర్వే నెంబర్ 6లో కోట్ల విలువ చేసే సుమారు 6 ఎకరాల 15 గుంటల ఎర్రకుంట జాడ ఏమైందని, నిగ్గు తేల్చాల్సిన సంబంధిత అధికారులు మౌనం వహించడం వెనక ఆంతర్యం ఏమిటని మండల కేంద్రానికి చెందిన బీసీ, ఎస్టీ, ఎస్సీ జాక్ కమిటీ మండల అధ్యక్షులు కటికే మధు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ప్రశ్నించారు. ఆదివారం ఈ మేరకు బాలానగర్ గ్రామ శివారులో ఉన్నటువంటి సర్వే నెంబర్ 6లో పర్యటించి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో దీనికి సంబంధించిన అంశాలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015లో 6 సర్వే నెంబర్‌లో సుమారు 13 ఎకరాల 30 గుంటలకు అనుమతి మంజూరు అయిందని, మిగతాది ఎర్ర కుంటగా చూపించడం జరిగిందన్నారు. కానీ 2024లో 6 సర్వే నెంబర్ లోని ఎర్ర కుంటగా చూపబడిన 6 ఎకరాల 15 గుంటలు, పక్క 5 సర్వే నెంబర్‌లోని మిగతా భూమిని కలుపుకొని ఎస్ ఎస్ డి కన్స్ట్రక్షన్స్ వారు ముడా అనుమతులు తెచ్చుకున్నారు. 2015 లో స్పెక్ట్రా వెంచర్ వారు చేయించిన ఎడి సర్వేలో ఉన్న ఎర్రకుంట, అదేవిధంగా 2024 25 సంవత్సరాలకు గాను సర్వే నెంబర్ 6 లో ఎర్రకుంట చెరువులో చేపలు వదులుతున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారులు సబ్సిడీ కింద కుంటకు కౌలుశిస్తు 1389 రూపాయలు కట్టించుకుని చేపల పట్టుటకు అనుమతి ఇచ్చినప్పుడు ఉన్న ఎర్రకుంట ఇప్పుడు ఏమైనట్టు అని ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ వెంచర్ కు ఏ విధంగా ఎన్ఓసి జారీ చేశారో ప్రజానీకానికి చెప్పాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంజీవని ఇన్ఫ్రా డెవలపర్స్ వారు కోట్ల విలువచేసే ఎర్రకుంటను మాయం చేసి, అమాయక కస్టమర్ల చేత ప్లాట్లు కొనుగోలు చేయించి, భవిష్యత్తులో వారిని నిండా ముంచబోతున్నట్లు వారు ఆరోపించారు. ఈ 6 ఎకరాల 15 కుంటల భూమి పక్కాగా గ్రామ నక్ష ప్రకారంగా ఎర్రకుంట స్థలమని, కోట్ల విలువ చేస్తే స్థలాన్ని కనుమరుగు చేసి, కోట్లు పోగేసుకోవాలనే ఉద్దేశంతో వెంచర్ యాజమాన్యం ఉందని వారు వాపోయారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ ఆక్రమణలను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయబోతున్నట్లు కటికే మధు, శ్రీనివాస్ తదితరులు స్పష్టం చేశారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## మతసామరస్యానికి ప్రతీక

**కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి మెలగుదాం**

**ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నగరంలోని కొత్త తోటలో హరిఓం డైరీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఘనంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో ఉపవాస దీక్షను విరమింపజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ నగరం కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి, సౌభ్రాతృత్వంతో జీవిస్తున్న నగరమని తెలిపారు. ఇలాంటి ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా హరిఓం డైరీ ఆధ్వర్యంలో నిరంతరం ఇఫ్తార్ విందు నిర్వహించడం అభినందనీయమని, సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, కార్పోరేటర్లు చిన్న, సిరాజ్ ఖాద్రీ, నాయకులు తఖి, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముకుందం రమేష్, సంజీవరెడ్డి, లీడర్ రఘు, యాదిరెడ్డి, గౌలి కిషన్, గౌలి మహేందర్, గౌలి కిశోర్, గౌలి సచిన్, మౌలానా బక్తియార్ సాహెబ్, మహ్మద్ అలీ సాహెబ్, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంపీ

## బాలుడి మృతిపై వేగవంతంగా విచారణ చేయాలి

**ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి**

**బిజినేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త:** పాలెం గ్రామంలో శనివారం తెల్లవారుజామున మూడు నెలల బాలుడు అనుమానాస్పద మృతి చెందిన ఘటనపై ఎంపీ మల్లు రవి , ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కేసు విచారణ వేగవంతంగా పూర్తి చేయాలి అని పోలీసులకు సూచించారు. ఆదివారం పాలెం గ్రామాన్ని సందర్శించి సంఘటన వివరాలను తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎంపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మూడు నెలల బాలున్ని నీటి తొట్టిలో వేసి హత్య చేసిన ఘటనను ఖండిస్తూ, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో చిన్నారులపై మృతి సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి, నిందితులను త్వరగా పట్టుకుని కఠిన శిక్షలు విధించాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. నాగయ్య నర్సమ్మ దంపతుల కూతురు నీలమ్మను పరామర్శించి ధైర్యం కోల్పోవద్దని ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ , సీఐ అశోక్ రెడ్డి ఎస్ఐ శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, గుడ్ల నర్వ సర్పంచ్ బాలస్వామి, గంగన మోని తిరుపతయ్య, బాలరాజ్, రామకృష్ణ, శేఖర్, పండ్లపాషా, రాజు అంజి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు

**2 నుండి 7 వరకు 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు**

**5న శ్రీవారి కళ్యాణోత్సవం**

**బిజినేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో వట్టెం వెంకన్న కొండపై వెలసి భక్తులు కోరిన కోర్కెలను నెరవేర్చే కల్పవృక్షముగా ఖ్యాతిగాంచిన శ్రీశ్రీశ్రీ అలవేలుమంగ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 40వ వార్షిక బ్రహ్మోత్సవములు ఈనెల 2 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసునామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ చతుర్దశి మొదలుకొని, ఫాల్గుణ బహుళ చవితి వరకు శ్రీమద్వేదమార్గ ప్రతిష్టాపనాచార్యులు శ్రీ మద్వుభయ వేదాంత ప్రవర్తకాచార్యులు శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య మంగళాశాసనములతో అనుగ్రహముతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 02 తేదీ శుద్ధ చతుర్దశి సోమవారం సుప్రభాతం, ప్రాతరారాధన, అర్ధన, సేవాకాలం, బాలభోగ నివేదన, హోమం, శాత్తుమొఱ, ఉత్సవాజ్ఞ స్నపనం, అలంకారం, రాజభోగ నివేదన, తీర్థప్రసాద గోష్టి. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ఉత్స వాసుజ్ఞ, స్వస్తి వాచనం, శ్రీ విష్వేక్సే నారాధన, వాసుదేవ పుణ్యాహవాచనమ్, రక్షాబన్దనం, ఋత్విక్ వరణం, మత్స ంగ్రహణం, అంకురార్పణం, ధ్వజాధివాసము. 03న శుద్ధ పౌర్ణమి మంగళవారం యాగశాల ద్వారతోరణ ధ్వజకుంభారాధన, వైనతేయ ప్రతిష్టా బాలభోగ నివేదన, పూర్ణాహుతి, తిరుచ్చి సేవ, ధ్వజారోహణం బలిప్రదానం, తీర్థ ప్రసాద గోష్ఠి. ఉ 7.00 గరౌాల ఆలయం మూసివేత. సా 7.00 గం.ల తరువాత స్వామి వారి అభిషేకం సాయమారాధన, చతుస్థానార్చన, భేరితాడనం, దేవతాహ్వానం, హోమం, బలిప్రదానం, శేష వాహన సేవ, 04 న పాడ్యమి బుధవారం ప్రాతారాధన, చతుస్థానార్చన, హోమం, సేవాకాలం, బాలభోగ నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం, శాత్తుమొఱ, తీర్థప్రసాద గోష్ఠి, ఉత్స వమూర్తులకు నవకలశ స్నపన తిరుమంజనము, అలంకారము, రాజభోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి. సాయమారాధన, చతుస్థానార్చన, మూర్తిమస్త్ర హోమం, ఎదురుకోలు ఉత్స వం, నివేద, పూర్ణాహుతి, హనుమద్వాహన సేవ, తీర్థప్రసాద గోష్ఠి 5 ప్రాతరాధన, చతుస్థానార్చన, సేవాకాలం, హోమం, బాలభోగ నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం, తీర్థప్రసాద వినియోగం శ్రీవారి కళ్యాణం రాజభోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి. సాయమారాధన, చతుస్థానార్చన, మూర్తిమస్త హోమం, నివేద, పూర్ణాహుతి, బలిప్రదానం, గరుడ వాహన సేవ, 6న ప్రాతరారాధన, కుమమణ్డలారాధన, సేవాకాలం, హోమం, బాలభోగ నివేదన, పూర్ణాహుతి, శాత్తుమొఱ, తీర్థ ప్రసాద గోష్ఠి, కల్పవృక్ష వాహన సేవ, నవకలశ స్నపనం, అలంకారం, రాజభోగ నివేదన, సాయంకాల ఆరాధన, కుంభ మండలారాధన, సేవాకాలం, నివేదన, పూర్ణాహుతి, అశ్వవాహన సేవ, 7వ తేదీ ప్రాతరాధన, చతుస్థానార్చన, సేవాకాలం, హోమం, బాలభోగ నివేదన, మహా పూర్ణాహుతి, శాత్తుమొఱ, తీర్థ ప్రసాద గోష్ఠి, నవకలశ స్నపనం చక్రతీర్థం, అలంకారం రాజభోగ నివేదన, దేవతోద్వాసనం, శ్రీ పుష్పయాగ ద్వాదశారాధన, పల్లకీ సేవ, సప్తవరణం, ధ్వజా అవరోహణం, మూకబలి, శాత్తుమొఱ, యాజమాన ఆశీర్వచనం, ఆచార్యాది సన్మానములు, ఉత్స వ పరిసమాప్తి40 వ వార్షిక బ్రహ్మోత్స వాలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాపరెడ్డి, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అనంత నరసింహారెడ్డి పాలక మండలి సభ్యులు తెలిపారు.


ప్రధాన ఆలయంలోని ఉత్సవమూర్తులు


వట్టెం వెంకటేశ్వర స్వామి ఆలయం

## ధన్వాడలో ఆర్ఎస్ఎస్ శక్తి ప్రదర్శన

**గ్రామ స్థాయిలో శాఖల బలోపేతానికి పిలుపు**



బౌద్ధిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

**ధన్వాడ, మార్చి 1 ప్రభాతవార్త :** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో మండల శాఖల సాంఘిక్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండలంలోని 11గ్రామాల శాఖ జట్లు పాల్గొనగా,మొత్తం 123 మంది స్వయం సేవకులు హాజరయ్యారు. ఉదయం 7 గంటల నుండి 8:30 గంటల వరకు నిర్వహించిన ఈ సాంఘిక్ కార్యక్రమంలో శారీరక వ్యాయామాలు, గణపతి ప్రణామం, దేశభక్తి గీతాలు, బౌద్ధిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రచారక్ భార్గవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో శాఖలను మరింత బలోపేతం చేయాలని, హిందువులు ఏకతాటిపై నిలిచి దేశ భక్తి భావజాలంతో ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధన్వాడ కండ కార్యవాహ కావలి రవికుమార్, బాలరాజు, హిందూ వాహిని జిల్లా సంయోజక్ సుదర్శన్ గౌడ్, విహెచ్పి జిల్లా ఉపాధ్యక్షులు మరాటి నారాయణ, మండల బీజేపీ అధ్యక్షులు శివరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సాంఘిక్ ద్వారా గ్రామ స్థాయిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**నారాయణపేట, మార్చి 1 ప్రభాతవార్త :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026,27 విద్యా సంవత్సరానికి గాను మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలు / వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాలలు) లో 5వ తరగతి ప్రవేశాల కోసం నారాయణపేట జిల్లాకు చెందిన గిరిజన బాల, బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్ తెలిపారు అభ్యర్థులు 31.08.2026 నాటికి 9 నుండి 11 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎత్తు, బరువు కొలతలతో పాటు స్టాండింగ్ బ్రాడ్ జంప్, సర్జికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ పరీక్ష, 800 మీటర్ల పరుగు పందెం వంటి క్రీడా పరీక్షలు నిర్వహించబడతాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన 10 మంది బాలురు, 10 మంది బాలికలను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలు మార్చి 13న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో, బస్ స్టాండ్ సమీపంలో నిర్వహించబడతాయని చెప్పారు. ప్రస్తుతం 202526 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ (గ్రామీణ ప్రాంతం రూ.1,50,000/ లోపు, పట్టణ ప్రాంతం రూ.2,00,000/ లోపు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో మార్చి 12లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నెం.123, ఐడీఓసీ భవనం, పాలకొండ గ్రామం, మహబూబ్‌నగర్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఉప్పునుంతల మార్చి 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవదారికుంట తాండ శివారు గ్రామమైన గుట్టమీద తాండ గ్రామానికి చెందిన సభావత్ బాలు అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ సంఘటన తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మునావత్ మంగమ్మ రతన్ సింగ్, ఉప సర్పంచ్ సభావత్ మంగమ్మ చంద్రు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థికసహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పిన నాయకులు, కష్ట సమయంలో తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా కల్పించారు.ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నేనావత్ వెంకటేష్‌తో పాటు గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామస్తులు సభావట్ బాలు అకాల మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని వారు కోరారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్

## ఎస్సీ,ఎస్టీ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**నారాయణపేట, మార్చి 1 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో పేట మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ కౌన్సిలర్లకు ఘనంగా సన్మానం నిర్వహించారు. 9వ వార్డు కౌన్సిలర్ యు.మహేష్, 5వ వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర, 10వ వార్డు కౌన్సిలర్ జయశ్రీలను శాలువాలు కప్పి అభినందించారు ఈ సందర్భంగా జాతర కమిటీ సభ్యులు ఈశ్వరమ్మ, టి. మాధవ్, చంటి, చిన్నికృష్ణ తదితరులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు తమ తమ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేయాలని, బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో నిలబెట్టాలని సూచించారు సన్మానిత కౌన్సిలర్లు మాట్లాడుతూ తమకు ఈ గౌరవం అందించిన జిల్లా అంబేద్కర్ జాతర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆజమ్మ, నాగమ్మ, హన్మంతు, గోపి పాండు,టి.హన్మంత్,అరుణ్,వెంకటేష్, నరసింహ,శివ,బాబు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్లను సన్మానిస్తున్న దృశ్యం

## ఆత్మకూర్ పాలకవర్గాలకు ఘన సన్మానం...

**ఆత్మకూర్ మార్చ్ 1, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వ ర్యంలో ఆదివారం రోజు ఆత్మ కూర్ పురపాలక సంఘం పాల కవర్గం, మార్కెట్ కమిటీ పాల కవర్గానికి ఘనంగా సన్మానం కొనసాగించారు. పెద్దమ్మ తల్లి దేవాలయ కమిటీ అధ్యక్షులు మొగిలి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మకూర్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైనటువంటి నాగమణి మరియు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన రహమతుల్లాను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సన్మానం కొనసాగించారు. ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణానికి నూతన పాలకవర్గాలుగా ఎన్నికైనటువంటి మున్సిపల్ పాలకవర్గం మరియు మార్కెట్ కమిటీ పాలకవర్గం పట్టణ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేయాలని దానికి తోడ్పాటుగా పెద్దమ్మతల్లి దేవాలయ కమిటీ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైనటువంటి నాగమణి మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లాను కౌన్సిలర్లను పలువురు శాలువాలు పూలదండలతో ఘనంగా సన్మానం నిర్వహించారు.



కొత్త పాలకవర్గాలను సన్మానం చేస్తున్న దృశ్యం

## నేడు శ్రీ ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట

**ఉప్పునుంతల, మార్చి ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవం, శ్రీ ఆంజనేయ స్వామి వారి ప్రాణ ప్రతిష్ట, కుంభ ప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సహ కమిటీ చైర్మన్ వేముల నరసింహా రావు, ముఖ్య కార్య నిర్వాణాధికారి నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దంపతులు, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా. మల్లురవి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు హాజరయ్యే ముఖ్య అతిథులకు,భక్తులకు, ప్రజలకు ఉప్పునుంతల మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి సౌజన్యంతో అన్న దానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా సాయంత్రం ఉమ్మడి జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం 8 గం.ల నుంచి 9 గం.ల వరకు పుణ్యాహవాచనము, ఉదయం 11.30 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.00 గం.లకు దేవతాహ్వానం, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి భేరి పూజ, హంస వాహన సేవ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సహ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఇఓ నర్సింహులు తెలిపారు.



మామిళ్ళపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

# ప్రభుత్వం ఏర్పాటులో లంబాడీలది కీలకపాత్ర

### గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.హన్మా నాయక్

**మహబూబ్‌నగర్ మార్చి 1 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలోని రామావత్ పంతు నాయక్ గిరిజన భవన్‌లో గిరిజన విద్యార్థి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ముగింపు భోగ్ బండార్ ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. హన్మానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ మహారాజ్, మరేమా యాడ్డి చిత్రపటానికి పూలమాలలతో భోగ్ బండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన లంబాడా బంజారా భాషా గోర్ బోలి లో పూజారి ఇస్లావత్ గోవర్ధన్ నాయక్ వినతి చేయడం అందజేశారు. కార్యక్రమానికి గిరిజన విద్యార్థి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామావత్ రవి రాథోడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హనుమానాయక్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రజాపాలనకు గిరిజన లంబాడా/ బంజారాలు వన్ సైడ్ ఓటు వేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారని, లంబాడి బంజారా తెగకు మంత్రి కేటాయించకపో వడం చాలా అన్యాయమని విచారం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ కు స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మూడు కోట్ల నిధులు కేటాయించడం చాలా సంతోషమన్నారు. ఈ సంద ర్భంగానే కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 01 డివిజన్, 48 డివిజన్‌లలో జనరల్ సీట్లు గిరిజనుల కేటాయించినందుకు మహమ్మద్ డిసిసి అధ్యక్షు డు సంజీవ్ ముదిరాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భం గా ఈ భోగ్ బండార్ కార్యక్రమానికి విచ్చేసిన మైదాన ప్రాంత ఐటిడిఏ రాష్ట్ర అధ్యక్షులు రామావత్ రఘురాం రాథోడ్, రాష్ట్ర నాయకులు బలరాం నాయక్, గిరిజన సేవా సంఘం సీనియర్ సలహాదారులు విస్లావత్ గోవర్ధన్ నాయక్, డిఎల్‌హెచ్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శరావత్ రాజేష్ నాయక్ ధాడి, గిరిజన రిజన సేవా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.రఘువీర్ సింగ్, గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు సభావాత్ పాండు నాయక్, జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య, శ్రీ గురు లోకామసంద్ బావోజీ ట్రస్ట్ అధ్యక్షులు బావోజీ రమేష్ రాథోడ్, గిరిజన విద్యార్థి సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝరప్ల రామచంద్ర పవర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ కార్పొరేటర్ కరంతోత్ దేవ్లీ మేఘ్య, గిరిజన నాయకులు వెంకట్ నాయక్, కేళావత్ విజయ్ విజయ్, టోపియా నాయక్ తదితరులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



భోగ్ బండార్ నిర్వహిస్తున్న నాయకులు

## శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్

# ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది ఎవరు..?

**గురి గింజ కింద నలుపెరగని నాయకులు**

**ప్రాజెక్టు ప్రతిపాదించింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా**

**తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై**

**నిందలు వేయడం సరికాదు**

**విలేకరుల సమావేశంలో మల్ రెడ్డి వెంకట్ రెడ్డి**

**ఉప్పునుంతల, మార్చి 1 ప్రభాతవార్త :** బలమూరు సమీపంలో శ్రీ ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును ప్రారంభించేందుకు కసరత్తు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందిన నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నిందలు వేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి ఖండించారు. ఆదివారం మండలంలోని తుమ్మన్ పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రజల వద్ద మెప్పు పొందాలని చూసిన నాయకులను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపారని అన్నారు. ప్రస్తుతం శనివారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పై చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్ గౌడ్, డిసిసి కార్యదర్శి, బీసీ జేఏసీ చైర్మన్ కాశన్న యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్ గౌడ్, ఉప సర్పంచ్ రాజురావు, ఉపాధ్యక్షులు మశన్న, ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, మాజీ సర్పంచ్ ఎల్లికంటి శ్రీనివాసులు, కొండారెడ్డిపల్లి సర్పంచ్ పంబ రాధాకృష్ణ, పోలేపల్లి సర్పంచ్ పానుగంటి ఎల్ల స్వామి, మహాదేవ్ సర్పంచ్ ఇమ్మడి సైదులు, గ్రామ అధ్యక్షులు జంగయ్య, యాదగిరి రావు, అనిల్ గౌడ్, మక్సూద్ , శేఖర్ లింగం తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



జిల్లా విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కోయిలకొండ మార్చ్ 1, ప్రభాతవార్త:** విద్యుత్తు మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ శాఖ అధికారి( ఎస్సీ) భీమా నాయకును కలసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ,మండల సాయి, జిల్లా స్థాయిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లకు 30 రోజుల పని దినాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మార్చి ఒకటి నుంచి జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ లందరూ సమ్మెబాట పట్టనున్నట్లు వారు తేల్చి చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లు గా ఉంటూ లైన్మెన్ పనులు చేస్తూ విద్యుత్ స్తంభాలు ఎక్కి పనులు చేయడం జరుగుతుందన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో జరగబోయే సమ్మెకు తరలి వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న నాయకులు

**దేవరకద్ర,మార్చి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపాలిటీ కి చెందిన యువకుడు గడ్డమీది నరేష్ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన కాటన్ ప్రదీప్ కుమార్ గౌడ్, నరేష్ పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తదనంతరం దహన సంస్కారాల నిమిత్తం తన వంతుగా రూ.20,000 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాందాస్, శ్రీకాంత్ యాదవ్, జెట్టి నరసింహారెడ్డి, కురువ శ్రీను, సిరాజ్, రఘు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్పోర్ట్స్ వాటర్ స్పోర్ట్స్

# అకాడమీలో దరఖాస్తులు ఆహ్వానం

### గిరిజన విద్యార్థులకు సదావకాశం

**మహబూబ్‌గర్,మార్చి 1 ప్రభాత వార్త :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 2026,27 విద్యా సంవత్సరమునకు మోడల్ స్పోర్ట్స్ పాఠ శాలలలో / వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడ పాఠశాలలలో) నందు 5వతరగతిలో ప్రవేశానికి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గిరిజన బాల,బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 2026 ఆగస్టు 31 నాటికీ 9నుండి 11సంవత్సరముల లోపు కలిగి ఉండాలని, వివిధ రకముల క్రీడల యందు బాల, బాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశమునకు గాను విద్యార్థిని, విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, సర్జికల్ జంప్, మెడిసిన్ బాల్ పుట్, షటిల్ రన్, 30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ, 800 మీ పరుగు పందెం పోటీలు నిర్వంచి ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన (10) గురు బాలురు, (10) బాలికలకు రాష్ట్ర స్థాయిలో ఎంపికకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికలను మార్చి 13 న జిల్లా క్రీడా ప్రాంగణము, బస్ స్టాండ్ దగ్గర, మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం నందు జరుపనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అన్ని యాజమాన్యలలోని ప్రస్తుతం ( 202526 సం.) 4 వ తరగతి చదువుచున్న గిరిజన బాల బాలికలు కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ గ్రామీణ ప్రాంతం వారికీ 1,50,000/ లు, పట్టణ ప్రాంతం వారికీ రూ. 2,00,000/ ల ఆదాయము ), రెండు ( 2 ) పాస్ పోర్ట్ సైజు ఫోటో లు, బోనఫైడ్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం , రూమ్ నెం. 123, ఐడిఓసి, పాలకొండ గ్రామం, మహబూబ్ నగర్‌లో తేది మార్చి 12 వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## బడ్జెట్ సమావేశంలో 20 శాతం

# ప్రభుత్వ విద్యకు నిధులు గ్రహించాలి

### తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షుడు ఎంఎన్ కిష్టప్ప

**ఉప్పునుంతల,మార్చి1 ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఎంఎన్ కిష్టప్ప డిమాండ్ చేశారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని టిఎన్జీవో భవనంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జక్క రామస్వామి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎన్ కిష్టప్ప మాట్లాడుతూ బడ్జెట్ సమావేశంలో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 25 ను తెచ్చి ప్రభుత్వ పాఠశాలను మూసి వేయడం సరైన చర్య కాదని ఆయన అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా శాస్త్రీయమైన మూఢవిశ్వాసాలు కలిగిన భావజాలాన్ని కలిగించే పాఠ్యాంశాలను కరికులంలో చేర్చడం, చరిత్రను తెలవకుండా చేయడం జరుగుతుందని పేద ప్రజలకు అవసరమైన శాస్త్రీయ విద్యా విధానం ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బలోపేతానికి ప్రభుత్వం ప్రతి పాఠశాలకు ఉపాధ్యాయులను గ్రహిస్తూ రాష్ట్ర విద్యా వ్యవస్థలో వివిధ స్థాయిల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పర్యవేక్షణ అధికారం నియమించాలని ఎస్సీ ఆర్టీ డైట్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు గోవర్ధన్, తెలంగాణ జేఏసీ కరీంనగర్ నాసరయ్య, నాగర్ కర్నూల్ జిల్లా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు జక్క బాల కృష్ణయ్య, బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర బాధ్యులు వెంకటేష్, ఎమ్మెస్ఎఫ్ బాధితులు ఖాసీం, ఏఐఎస్ఎఫ్ బాధ్యులు ప్రేమ్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా మండల బాధ్యులు మోతీరాం, డిటి నాయక్, ఎన్.మోతీరాం, లక్ష్మీ ్మనారాయణ, జానకిరామ్, రత్న ప్రసాద్, నాగరాజు, శ్రీశైలం, విజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ సభ్యుల

## రోడ్డు విస్తరణ పనుల్లో పారదర్శకత ఉండాలి

**ఉప్పునుంతల, మార్చి 1 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి కంసాని పల్లి కి వెళ్ళే మార్గంలో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఆర్అండ్‌బి శాఖ అధికారులు , గుత్తేదారులు పారదర్శకత చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచనల మేరకు టీ పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులు పారదర్శకంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. ఆధిపత్య పోరుతో కొంతమంది రోడ్డుపై అక్రమంగా భవనాలను నిర్మించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకున్న భవనాలను వదిలివేసి ప్రభుత్వ స్థలం వైపు మొగ్గు చూపడం సరికాదని, ఆర్అండ్‌బి శాఖ అధికారులు, గుత్తే దారులు పారదర్శకంగా రోడ్డు పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్అండ్‌బి అధికారులు పనులు చేపడితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ ప్రాంతంలో రోడ్ అభివృద్ధి చెందడం గ్రామ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని, కానీ రోడ్డు విస్తరణ పనుల పట్ల అధికారులు, గుత్తేదారులు పారదర్శకంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరారు.



ఉప్పునుంతలలో జోరుగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

## 3న శ్రీ కురుమూర్తి ఆలయం మూసివేత

**చిన్నచింతకుంట,మార్చి1 ప్రభాతవార్త:** మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల దేవరగట్టులోని కాంచన గుహలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం ఈనెల 3న మూసి వేయనున్నట్లు ఆలయ ముఖ్య అర్చకులు వెంకటయ్య , సత్యనారాయణ, అనంత విజయ్, ఈవో మదనేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నాడు పౌర్ణమి, చంద్రగ్రహణం వల్ల శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం ఉదయం ఏడు గంటల నుంచి ఆలయం మూసి వేయడం జరుగుతుందన్నారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకు స్వామివారి ఆలయం సంప్రోక్షణ పూజలు నిర్వహించిన అనంతరం ఆరు గంటలకు భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోవచ్చనివారు తెలిపారు. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు గమనించగలని వారు తెలిపారు.

## చిన్నారిని ఆశీర్వదించిన దేవరకద్ర ఎమ్మెల్యే దంపతులు



చిన్నారి సమీక్ష జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

**దేవరకద్ర, మార్చి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామ ఉప సర్పంచ్ గోవర్ధన్ నాయి కూతురు సమీక్ష జన్మదిన వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దంపతులు పాల్గొని ఆశీర్వదించారు. సమీక్ష కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ముఖ్య నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మంది పోలీసులతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం జీఆర్ ఫౌండేషన్ అధినేత జి.రఘు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు అభ్యర్థి స్వాతి హరిబాబును గెలిపించినందుకు వార్డు ప్రజలకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేశారు. వార్డు లో ఎలాంటి సమస్యలు తలెత్తిన వార్డు కౌన్సిలర్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీని నెరవేర్చామని వార్డు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముమ్ముందు జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ సొంత నిధులు వెచ్చించి అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నామనివార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం సిఐ, ఎస్ఐ లను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, జి ఆర్ ఫౌండేషన్ అధినేత జి.రఘుతో పాటు వార్డ్ కౌన్సిలర్ స్వాతి హరిబాబు, న్యాయవాది ఉత్తరయ్య, అచ్యుతాపురం గ్రామ సర్పంచ్ శాంతయ్య, నిరంజన్ గౌడ్, శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ రెడ్డి, రఘు బంగాలి, తిరుపతయ్య, రఘు, జేమ్స్, జ్ఞానేశ్వర్, చుక్క పెంటయ్య, విజయ్, అబ్దుల్ వహీద్, అశోక్, నాగరాజు, పెద్ద ముక్కల రవి, శివ, రాజు, గంగ ప్రసాద్, సాయికిరణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

## పట్టణం పరిశుభ్రంగా ఉండాలి

**మురుగునీరు చెత్త లేకుండా శుభ్రం చేయాలి**

**జడ్చర్ల మున్సిపాలిటీలో తెల్లవారుజామున అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన**



జడ్చర్ల మున్సిపాలిటీలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్

**జడ్చర్ల,మార్చి 1 ప్రభాతవార్త :** పారిశుద్ధ్య చర్యలు ఎలా చేపడుతున్నారు, డ్రైనేజీలను నిత్యం శుభ్రం చేస్తున్నారా లేదా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా అంటూ మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆరా తీశారు. జడ్చర్ల పట్టణం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఇంఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఆదివారం ఉదయం జడ్చర్ల పట్టణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణంలో వీధులు, డ్రైనేజీ చెత్త లేకుండా క్లీనింగ్ నిర్వహించాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

## సమాజ మార్పుకు పంచ పరివర్తన మార్గం

**వనపర్తిలో ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం**

**ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్, విభాగ్ సంఘచాలక్ యేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్**




సమావేశంలో మాట్లాడుతున్న కూర జయదేవ్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 1 ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాజ జాగృతికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను పరిచయం చేయ డానికి ఆదివారం వనపర్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జోగుళాంబవనపర్తి జిల్లాల ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రంగాలకు చెందిన వ్యాపా రులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, రాజకీయ నాయకులు హాజర య్యారు. ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్, విభాగ్ సంఘచాలక్ యేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సానుకూల పరివర్తన తీసుకురావాలంటే ఐదు అంశాలను ఆచరించాలని సూచించారు.

## ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకండి

**పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**



**మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 1 ప్రభాతవార్త :** విద్యా కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్ట్ లో ఉపాధ్యాయ వ్యవస్థను కించపరిచే విధంగా ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువ అని సంబోధించడం, రిపోర్ట్ ఇవ్వడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఈ వ్యాఖ్యలు ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేయడంతో పాటు ,వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ అన్నారు. ఉపాధ్యాయులనే టార్గెట్ చేసుకుని వారి జీతాలు, వారి పని తీరు గురించి అశాస్త్రీయమైన ప్రతిపాదనలు చేసిందన్నారు. విద్యావ్యవస్థ బలోపేతం కోసం సూచనలు ఇవ్వడం మరిచి ప్రభుత్వ ఉపాధ్యాయులే టార్గెట్‌గా రిపోర్టులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమనీ ప్రశ్నించారు. విద్యా వ్యవస్థ కోసం సూచనలు మార్పులు వస్తే తప్పకుండా వాటిని అంగీకరించి అమలు చేయడానికి మేము అంత సిద్ధంగా ఉన్నాం కానీ మా ఉనికికే ఎసరు పెడితే ఏ మాత్రం ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. భారతదేశంలోని పలు రాష్ట్రాలలో జీతాలు తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. వేతనాల నిర్ణయం అనేది నిత్యావసర వస్తువల పెరుగుదల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో పే రివిజన్ కమిషన్(పీఆర్సీ) పరిధిలో వుండే అంశమని పేర్కొన్నారు. ఉత్తీర్ణత మార్కులు 35 శాతం నుంచి 45 శాతం పెంచే ప్రతిపాదనలు వంటి ఎన్నో ప్రతికూల ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు మూడేళ్లుగా పీఆర్సీ,డీఏ ,పెండింగ్ బిల్లులు రాక ఉదోగ,ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అనుచితం కాదని,ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకండా వాటిని కాపాడాలని పీఆర్టీయూ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## విద్యాభివృద్ధికి ముందుకు కదిలిన ఉపాధ్యాయులు

**టెన్త్ క్లాస్ విద్యార్థులకు భవిష్యత్తుపై దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయులు**

**దేవరకద్ర, మార్చి 1 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో పుట్టి పెరిగి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడిన ఉపాధ్యాయులు గ్రామ విద్యాభివృద్ధి కోసం ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోర్డు ఎగ్జామ్ ఎలా రాయాలి,టెన్త్ తర్వాత ఏ కోర్సు చేస్తే బాగుంటుందనే దానిపై విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. చదువుతోపాటు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడితే జీవితంలో అనుకున్న లక్ష్యం చేరుకుంటారని విద్యార్థులకు సూచించారు. టెన్త్ క్లాసులో ప్రతిభ కనబరిచిన గ్రామ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5000. రెండవ బహుమతి రూ. 3000 అందజేస్తామని సర్పంచ్ రామాంజనేయులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎక్సమ్ ప్యాడ్స్,పెన్నులు, స్కేల్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు,ఉపాధ్యాయులు గెజిటెడ్ హెచ్ఎం జంగం నాగేశ్వరయ్య, హిందీ స్కూల్ అసిస్టెంట్ పట్నం చెన్నయ్య, సోషల్ స్కూల్ అసిస్టెంట్ బంగారి వెంకటేష్, గ్రంథాలయ నిర్వాహకులు కుమ్మరి నరేష్, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యాకమిషన్ ప్రతిపాదనలు అవమానకరం

**సమావేశంలో ముక్తకంఠంతో ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త :** విద్యాకమిషన్ ప్రతిపాదనలు అర్థరహితం, అవమానకరమని, ఉపాధ్యాయుల ప్రతిష్ఠను దిగజార్చడమే అని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద టిఎన్‌జిఓ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అకునూరి మురళి నేతృత్వంలో గత నెల 26న ప్రభుత్వానికి అందచేసిన తెలంగాణ విద్యాకమిషన్ రిపోర్ట్‌లో ఉపాధ్యాయుల ప్రతిష్ఠను, ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా రిపోర్ట్ ఉందని, ఉపాధ్యాయుల వేతనాలు తగ్గించాలని లేదా సమీక్షించాలని పేర్కొనడం అశాస్త్రీయమైన సూచన అని పేర్కొన్నారు. వేతనాలు నిర్ధారించేది పిఆర్‌సి కమిటి ధరలు,వ్యయాలు బేరీజు వేసుకొని ఆ ప్రతిపాదికన అన్ని రకాల ఉద్యోగులకు ఇస్తుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అందరి కంటే ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువగా ఉంటున్న ప్రస్తుత సందర్భంలో ఉపాధ్యాయులను కించపరిచే విధంగా సిఫార్సులు ఉండడం బాధాకరం. ప్రముఖ మేధావిగా విద్యపట్ల మంచి అవగాహన ఉన్న వ్యక్తిగా ఉన్న అకునూరు మురళి నేతృత్వంలో విద్యాకమీషన్ ఉపాధ్యాయుల శ్రమకు విలువ తగ్గించడం, కార్పొరేట్ విద్యాలయాల్లో యాజమానుల అనుకూల విధానాలను అమలుచేసే విధంగా ఉపాధ్యాయులకు కనీస ప్రజాస్వామ్య విలువలు లేకుండా,మనోభావాలు దెబ్బతినే విధంగా సిఫార్సులు చేయడం విచారకరమని భావించారు. తెలంగాణ విద్యా కమీషన్ రిపోర్ట్ విద్యా వ్యవస్థను బాగు పరిచే సూచనలు ఆహ్వానిస్తున్నామని, విద్యకు 20 శాతం కేటాయింపులు ఇవ్వాలని, దాని అమలుకు ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కావున రిపోర్ట్ లో ఉన్న అసంబద్ధ సిఫార్సులను వెనక్కి తీసుకోవాలని లేకపోతే నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా ఎస్ఎల్‌టి ఏ.సురేంద్రనాథ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రవికుమార్, టిపియూఎస్ రాష్ట్ర నాయకులు సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, టిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు శ్యామ్ బాబు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రవీందర్ గౌడ్, పి.కురుమయ్య టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమూద్, నవీన్, ఎస్ఎల్‌టిఏ ప్రధాన కార్యదర్శి గోపాల్, ఆర్‌యుపిపి జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, బి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.బాలశంకర్, బిసిటిఏ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి.రాఘవేందర్, ధనుంజయ, టిజి యూఎస్ జిల్లా అధ్యక్షులు హీరాలాల్,టీటీయూ జిల్లా అధ్యక్షులు జుర్రు నారాయణ, టీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు సతీష్, టీజీ హెచ్ఎంఏ జిల్లా అధ్యక్షులు చెన్న కిష్టయ్య, టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రమాకాంత్, యుటిఏటిఎస్ జిల్లా అధ్యక్షులు సల్మాన్ ఖాన్,పెట్స్ జిల్లా జగన్మోహన్ గౌడ్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నర్సింలు తదితర సంఘాలు పాల్గొన్నారు.

# చరిత్ర పరిరక్షణలో ఉప్పరిపల్లి సర్పంచ్ సేవలు ప్రశంసనీయం

**పురాతన శివాలయాన్ని పరిరక్షించిన**

**ఉప్పరిపల్లి గ్రామ సర్పంచి బొజ్జ గీత అమరేందర్ రెడ్డి**

**కొనియాడిన పురావస్తు పరిశోధకుడు డా. ఈమాని శివ నాగిరెడ్డి**



పురాతన రాతి పై ఉన్న శాసనాన్ని చదువుతున్న ప్రముఖ పురావస్తు పరిశోధనలు ఈమాన్ శివ నాగిరెడ్డి



ఉప్పరిపల్లి లో పూరతన కాలం శిల్పాలను పరిశీలిస్తున్న ప్రముఖ పురవాస్తు పరిశోధకులు ఈమాని శివ నాగిరెడ్డి

**ఉప్పునుంతల,మార్చి 1 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలోని 800 సంవత్సరం నాటి శిథిలావస్థకు చేరిన శివాలయాన్ని పదిలపరిచిన గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి ని ప్రముఖ పురావస్తు పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి అభినందించారు. సీఎం ప్రవాసి ప్రజావాణి స్టేట్ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆయన గ్రామాన్ని సందర్శించి పురావస్తు అవశేషాలను పరిశీలించారు. గ్రామశివారులో ఉన్న ఊరచెరువు ఒడ్డున ఉన్న వీరన్నగుడి శివాలయంలో ఉన్నశిల్పాలను పరిశీలించారు. శివాలయంలో చాళుక్యుల కాలపు శివలింగము వీరన్నగుడిలో కాకతీయుల కాలపు నిలు వెత్తు వీరభద్రుని విగ్రహం మరో శివుని విగ్రహము తల భాగము ఆలయాల ముందు గోగ్రహణ సందర్భంగా జరిగిన ఘర్ష ణలో మరణించిన ఇద్దరు వీరుల శిల్పాలు కాకతీయుల కాలపు నాగదేవత శిల్పాలు గ్రామ చరిత్రకు అద్దం పడుతున్నాయన్నారు. శివాలయం ముందున్న బండలపై పాత రాతియుగమునాటి రాతి గుడ్డలను అరగదీసిన ఆనవాళ్లను గుర్తించిన శివనాగిరెడ్డి అవి సామాన్య శక పూర్వము 4000 సంవత్సరాల నాటిదని చెప్పారు. గ్రామ శివారులోని కస్పా బండ దగ్గర భూమిలో కూరుకుపోయిన కందూరి చోళ నలభీమ చోడుని శాసనాన్ని సర్పంచి జెసిబి సహాయంతో బయటికి తీయించగా ఆ శాసనాన్ని చదివిన శివ నాగిరెడ్డి మామిళ్ళపల్లి నరసింహస్వామి పూజ నైవేద్యాల కోసం గ్రామంలోని కొంత భూమిని దానం చేసిన వివరాలు ఉన్నాయని చరిత్రకారులైన శివ నాగిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్‌రెడ్డి,తెలంగాణ ప్రవాసి ప్రజావాణిబొజ్జ అమరేందర్ రెడ్డి, శిల్పి వెంకట్ రెడ్డి ,వీర శేఖరా చారి ,గ్రామ ఉపసర్పంచ్ రేసోజ్ శ్రీనివాసచారి, వార్డు సభ్యులు వెంకటయ్య ,పర్వతాలు, గ్రామస్తులు భాస్కర్ రెడ్డి,దామెదర్ రెడ్డి, జగత్ రెడ్డి తోటపల్లి వెంకటరెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రమేష్ గౌడ్, తోల రాజు యాదవ్, ప్రదీప్ రెడ్డి, శేఖర్ గౌడ్, కత్తులయ్య పాల్గొన్నారు.

## పాల్సాబ్ గుట్ట ప్రగతికి పునరంకితమై పనిచేస్తా

**సేవకుడిలా నిత్యం అందుబాటులో ఉంటా.. 57వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్**



కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ ను సన్మానిస్తున్న కాలనీవాసులు

**మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 1 ప్రభాతవార్త :** ప్రజల సహకారంతో పాల్సాబ్ గుట్ట ప్రగతికి పునరంకితమై పనిచేస్తానని మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 57వ డివిజన్ కార్పొరేటర్ యం.పి.ప్రవీణ్ కుమార్ అన్నారు. కార్పొరేటర్ గా బాధ్యతలు చేపట్టిన యం.పి.ప్రవీణ్ కుమార్ ను పాల్సాబ్ గుట్టలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఒక కార్పొరేటర్ గా కాకుండా ఒక సేవకుడిగా ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి తన శక్తిమేర కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ల సహకారంతో 57వ డివిజన్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్ తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. డివిజన్ ఏళ్ల తరబడి పేరుకు పోయిన సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో తాగునీరు సరఫరా , అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల నిర్మాణం లాంటి పనులను అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు, యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్‌ను కాలనీ వాసులు పెద్ద ఎత్తున సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు ఎ.ఆడమ్స్, ఆనంద్ కుమార్, ప్రభాకర్, జిహెచ్‌యం దశరథ్ నాయక్, పిఆర్‌టియు టిఎస్ సోషల్ మీడియా కమిటీ మెంబర్ లయన్ అశ్విని చంద్రశేఖర్, విశ్రాంత జిహెచ్‌యం జ్యోతి, కండక్టర్ శ్యామ్ సుందర్, మనోహర్, ఆంజనేయులు, రాజు, శ్రీకాంత్,నితీష్, సుమన్,సత్యం , శ్యామ్ మోహన్, వెంకటేష్, నరసింహ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత కల్పించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతల డిమాండ్**




వ్యవసాయ కార్మిక సంఘం
జిల్లా మహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకుల అభివాదం

**ఆత్మకూర్ మార్చ్1, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సలీం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సలీం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు కనీస భద్రత కల్పించకపోవడం ఏ కాకుండా వ్యవసాయ కూలీలకు జీవనోపాధిగా ఉన్నటువంటి ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుయుక్తుల పన్నుతోందని ఉపాధి హామీ పథకం చట్టాన్ని రక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా కూలీలు ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేటర్ రంగాలకు లక్షలాది కోట్ల రూపాయలను మాఫీ చేస్తూ పేద మరియు బడుగు బలహీన వర్గాల ప్రజలకు కనీసం రోజుకు 700 రూపాయల వేతనం చెల్లించేందుకు మనసు రావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు చెల్లిస్తామని ప్రగల్బాలు పలకడమే కాకుండా ఆచరణలో మాత్రం వ్యవసాయ కూలీలను నిలువునా ముంచుతుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత కల్పించడమే కాకుండా కనీస వేతనాలు చెల్లించే విధంగా చట్టాలు రూపొందించాలని వ్యవసాయ రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షత వహించిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి హనుమంతు రాష్ట్ర నాయకులు అరుణ్ కుమార్ , జిల్లా నాయకులు కే రాజన్న తదితరులతో పాటుగా పలువురు వ్యవసాయ కూలీలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలర్‌ఫుల్‌గా ఠాగూర్ మెమోరియల్ స్కూల్ వార్షికోత్సవం

- వార్షికోత్సవంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు
- బడ్జెట్ స్కూల్స్‌కు ఠాగూర్ స్కూల్ ఆదర్శం
- చిన్నారుల నృత్య ప్రదర్శనలు అద్భుతం
- ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మణ్




వార్సికోత్సవంలో ప్రసంగిస్తున్న
ట్రస్మా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మణ్

**భూత్పూర్,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్ ఏడో వార్షికోత్సవం స్కూల్ కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య అధ్యక్షతన ఎంతో ఘనంగా జరిగింది. వార్షికోత్సవానికి వాఖ్యాతగా ప్రముఖ యువకవి గుముడాల చక్రవర్తిగౌడ్ వ్యవహరించారు. ఈ వార్షికోత్సవానికి ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను పెంపొందించడమే లక్ష్యంగా,ధనార్జనే ధ్యేయంగా కాకుండా మానవతా విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిం చేందుకు కృషిచేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ వెంకటయ్య అభినందనీయులన్నారు, విద్యార్థుల సంఖ్యను కాకుండా విద్యార్థుల క్రమశిక్షణ,నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా ఠాగూర్ స్కూల్ యాజమాన్యం పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థినివిద్యార్థుల్ని గురుకులాలకు పంపుతున్న కరస్పాండెంట్ వెంకటయ్య,ప్రిన్సిపాల్ చాముండేశ్వరిలు కృషిచేయడం వారి ఔనత్యాన్ని చాటుతుందన్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు,వారి అభినయాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలలో ఎంతమందున్నారన్నదీ కాకుండా ఎంతమందిని మనం ఉత్తమోత్తములుగా తీర్చిదిద్దుతామన్న లక్ష్యంతో తమ స్కూల్ పనిచేస్తుందన్నారు. ఉన్నతాశయాలతో,ప్రమాణాలు కల్గిన విద్యను విద్యార్థులకందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆశయ సాధనలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయులు తనకు సహకరిస్తున్నారన్నారు. వార్సికోత్సవానికి విచ్చేసిన అతిథులను శాలువలు,పూలమాలలు,మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు వంశీమోహన్‌రెడ్డి,ట్రస్మా భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ(సత్యం),వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాసులు(శ్రీసరస్వతీ విద్యామందిర్- తాటికొండ),సత్యం(బాదం సరోజినీదేవి పాఠశాల-వెల్కిచర్ల)లతో పాటు భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ ఐదోవార్డు కౌన్సిలర్ కెంద్యాల పద్మ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కెంద్యాల మశ్చందర్,కెంద్యాల రాజేష్,మట్టి ఆనంద్,టీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మొహ్మద్ సాధిక్‌లతో పాటు స్కూల్ ఉపాధ్యాయురాళ్లు సన,మాధవి,సృష్టి,పుష్ప,రాణి తదితరులు పాల్గొన్నారు.




వార్షికోత్సవంలో అలరించిన చిన్నారుల ప్రదర్శన

## బాధిత కుటుంబాలను పరామర్శ

**చిన్న చింతకుంట, మార్చి 1 ప్రభాతవార్త :** మండలంలోని జనవరి 6న పర్దీపూర్ గ్రామానికి చెందిన కావలి నరసింహ, శివకుమార్ లు మధ్యప్రదేశ్ లోని ఉజ్జయిని ఆలయ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి కుటుంబాలను ఆదుకోవాలని బిజెపి జిల్లా నాయకులు నంబి రాజు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు శాంతి కుమార్, కావలి నరసింహ, శివకుమార్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధ్యత కుటుంబాలకు బిజెపి పార్టీ అండగా నిలుస్తుందని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కురువ రమేష్, రాములు కురవ నరేష్, లాల్ కోట ఆంజనేయులు,అమ్మాపూర్ వినోద్ , శ్రీకృష్ణ, వెంకన్ గౌడ్,సాంబశివుడు, సురేందర్ రెడ్డి, చిట్టెన్న, శ్రీనివాస్ గౌడ్, బాలచందర్ ,మున్నెప్ప తదితరులు ఉన్నారు.

## నేడు అందుబాటులో యూరియా

**ఉప్పునుంతల మార్చి 1 ప్రభాతవార్త :** మండలంలోని రైతులకు నేడు సోమవారం యూరియా అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉప్పునుంతల మండలంలోని రైతులకు అవసరమైన యూరియాను సోమవారం ఉదయం 9 గంటల నుంచి యాప్ ద్వారా యూరియా బుకింగ్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. మండల పరిధిలోని పలు కేంద్రాల్లో యూరియా సంచులు అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్‌విండో ఉప్పునుంతల కేంద్రంలో 1100 సంచులు ఆగ్రో రైతు సేవ కేంద్రం ఉప్పునుంతలలో 400 సంచులు హకా తాడూరులో 270 సంచులురైతులు ఆధార్ కార్డు, రైతు పాస్‌బుక్‌తో సమయానికి సంబంధిత కేంద్రాలకు హాజరై యూరియాను బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఎటువంటి గందరగోళానికి తావు లేకుండా రైతులు క్రమబద్ధంగా వ్యవహరించాలని కోరారు.

## పొలైట్ మాడల్ హైస్కూల్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశం

**దేవరకద్ర, మార్చి 1 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని పొలైట్ మాడల్ హైస్కూల్ లో నిర్వహించిన వీడ్కోలు సమావేశం భావోద్వేగ వాతావరణం లో జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను గుర్తు చేసుకుంటూ గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ కథలయ్య యాదవ్ మాట్లాడుతూ పాఠశాల క్రమశిక్షణ, విలువలను జీవితంలో నిలబెట్టుకోవాలి. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

**దామరగిద్ద, మార్చి 1 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య యువకిరణం నాయకుడు నందారం ప్రశాంత్ కొడంగల్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా దామరగిద్ద మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు నందారం ప్రశాంత్‌ను ఘనంగా సత్కరించి, ప్రజాప్రతినిధిగా ఆయన మరింత బాధ్యతతో పనిచేసి ప్రజలకు ఉపయోగకరమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ శెట్టి, ప్రభాకర్, కోస్గి మధు, రవికుమార్, హరీష్, శాంతు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ పై కేసు నమోదు

**వెల్దండ,మార్చి1 ప్రభాతవార్త :** ఆర్టీసీబస్సు డీసీఎం ఢీకొన్న సంఘటనలో డీసీఎం డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ హైదరాబాద్ శ్రీశైలం జాతీయరహదారిపై కొట్రచౌరస్తా సమీపంలోని ఫంక్షన్ హాల్ వద్ద శనివారం అర్ధరాత్రి పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం బయలు దేరుతుండగా కల్వకుర్తికి వెళ్తున్న డీసీఎంను వెనకాల నుండి ఆర్టీసీ బస్సు డీసీఎంను ఢీకొనడంతో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో కల్వకుర్తికి చెందిన డీసీఎం డ్రైవర్ మహమ్మద్ ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లాకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కాసింపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మోడల్ హాస్టల్ తనిఖీ చేసిన కాంగ్రెస్ నేత మట్ట వెంకటయ్య గౌడ్

**వెల్దండ, మార్చి 1 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మోడల్ బాలికల వసతి గృహాన్ని కాంగ్రెస్ నేత మట్ట వెంకటయ్య గౌడ్ ఆదివారం సందర్శించి విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచిందని నాణ్యమైన మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిగొండ రమేష్, సిబ్బంది మంజుల, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మట్ట భరత్ , విద్యార్థులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## ఎస్సీ కాలనీకి నూతన స్వాగత తోరణం
## స్వంత నిధులతో శంకుస్థాపన చేసిన కౌన్సిలర్ పొన్నాల ప్రమీల

**గుమ్మడిదల మార్చి 1 ప్రభాతవార్త:** గుమ్మడిదల మున్సిపాలిటీ 15వ వార్డులోని ఎస్సీ కాలనీలో నూతన స్వాగత తోరణం నిర్మాణానికి కౌన్సిలర్ పొన్నాల ప్రమీల తమ సొంత నిధులను కేటాయించి శంకుస్థాపన చేశారు. ఈ కమాన్‌ను గుమ్మడిదల మాజీ సర్పంచ్ కీర్తిశేషులు పొన్నాల విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేయనున్నట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు.ఎస్సీ కాలనీ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా కృషి చేస్తామని కౌన్సిలర్ ప్రమీల స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్,వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య,అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తుడుం రవి,కౌన్సిలర్లు ఆకుల మాధవి, యంజాల సంజీవరెడ్డి, మూడుచింతల నరేందర్ రెడ్డి,సురభి కుమార్ గౌడ్, చక్రపాణి, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాసరెడ్డి, హుస్సేన్, దప్పు శ్రీనివాస్, పలువురు , స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో కష్టపడి పని చేసుకోవాలి...
### మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్..

**గుమ్మడిదల మార్చి1 ప్రభాతవార్త** నూతనంగా ఏర్పాటు చేసుకున్నటువంటి జెసిబి, ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ యజమానులు వాహనాలకు ఇన్సూరెన్స్ డ్రైవర్లకు లైసెన్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ అన్నారు.ఆదివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నూతన ట్రాక్టర్స్ జెసిబి వాహనదారులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి కౌన్సిలర్స్ మూడు చింతల నరేందర్ రెడ్డి, కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, శ్రీచూర్ణం చక్రపాణి,బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మేకల యాదగిరి,



తదితరులను శాలువాలతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... గుమ్మడిదల గ్రామానికి చెందిన ట్రాక్టర్ జెసిబి టిప్పర్ వాహనదారులు కలిసికట్టుగా ఉండి సర్వే నంబర్ 109 లో జరుగుతున్నటువంటి నిర్మాణాలలో గ్రామానికి చెందిన వాహనాలకు పని కల్పించాలన్న మంచి సదుద్దేశంతో ఏర్పాటు చేసుకున్నటువంటి యూనియన్ దారులు కలిసికట్టుగా ప్రతి ఒక్కరు ఉండాలని సూచించారు తమ ప్రాంతంలో అభివృద్ధి పనులకు తమ వాహనాలకు పని కల్పించే విధంగా పాలకవర్గం చూస్తుందన్నారు ఏమీ జరిగినప్పటికీ యూనియన్ విడగొట్టడానికి కొంతమంది ఆకతాయిల మాటలతో విడిపోకుండా కలిసికట్టుగా ఉండాలని సూచించారు మీరు కోరిన విధంగా మినీ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనులలో గ్రామంలోని వాహనాల ద్వారానే పనులు జరిపే విధంగా సంబంధిత పారిశ్రామిక ప్రాంత వాసులతో మాట్లాడి పనులు కల్పిస్తామన్నారు కార్యక్రమంలో ముద్దంగుల వడ్డే ఎల్లయ్య, యూనియన్ అధ్యక్షులు సంగం కుమార్, ఉపాధ్యక్షులు కాశబోయిన ఆంజనేయులు, కార్యదర్శి ముద్దంగుల భాస్కర్, మద్యేటి మల్లేష్ క్యాషియర్ ఓనర్ సైన్ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గజేంద్ర మోక్ష ఆశ్రమంలో కాలా కీర్తన సేవ

**సిర్గాపూర్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గజేంద్ర మోక్ష ఆశ్రమలో గత వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్త కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలా కీర్తన సేవ కార్యక్రమం శ్రీ కరణ్ గజేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని శ్రీ కరణ్ గజేంద్ర మహారాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భగవంతుడిపై ప్రేమ విశ్వాసంతో ఆధ్యాత్మిక చింతనతో మానవ జన్మ సార్థకం అవుతుందన్నారు. కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రుక్మిణి సమేత పాండురంగా స్వామిని దర్శించుకుని శ్రీ కరణ్ గజేంద్ర మహారాజ్ ఆశీస్సులు అందుకున్నారు.



గజేంద్ర మోక్ష ఆశ్రమంలో కాలా కీర్తన సేవలో ప్రసంగిస్తున్న శ్రీకరణ్ గజేంద్ర మహారాజ్

## ఉపాధ్యాయులను అవమానించడం హేయమైన చర్య
### తపస్ మెదక్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు

**పావన్నపేట, మార్చి 1, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యా కమిషన్ ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి భంగం కలిగే విధంగా మాట్లాడటం దురదృష్టకరమని తపస్ మెదక్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విలేకరితో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ జీతాలు తీసుకుంటున్నప్పటికీ కేవలం ఉపాధ్యాయుల జీతాల గురించి నివేదికలో పొందుపరిచి, ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గం మైన చర్యని ఆయన పేర్కొన్నారు.విద్యా కమిషన్ చైర్మన్ గురువారం ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదికలో ఉపాధ్యాయుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని, ఈ కమిషన్‌లో ఉన్న ఏవ్యక్తి కూడా విద్యారంగానికి సంబంధించిన వారు కాకపోవడం శోచనీయం అని ఆయన అన్నారు. విద్యకు సంబంధించిన అంశాలను కాకుండా ఆర్థిక విష యాలను ప్రస్తావించే అధికారం విద్యా కమిషన్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ లోకం పట్ల కమిషన్ చైర్మన్ విషాన్నికక్కడం సమంజసం కాదు.వెంటనే ఆ అంశాలను నివేదిక నుంచి తొలగిం చాలని, ఉపాధ్యాయుల పట్ల చేసిన వ్యాఖ్యలకు విద్యా కమిషన్ చైర్మన్ సభ్యులు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోలో ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల గురించి పొందుపరిచి ఇప్పటివరకు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. ఉపాధ్యాయులను కించపరిచే అంశాలను నివేదికలో ఉన్నాయని వాటిని తొలగించనట్లయితే తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమ చేపడుతుందన్నారు.

## మండల విద్యాధికారిగా శేఖర్ బాధ్యతల స్వీకరణ

పెద్దశంకరంపేట, మార్చి 1, ప్రభాతవార్త ః పెద్దశంకరంపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) గా వెన్నుశేఖర్ ఆదివారం నాడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పదవిలో సేవలందించిన వెంకటేశం పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన స్థానంలో శేఖర్ నియామకమయ్యారు. మండలంలోని ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు ప్రభుత్వ విద్యా పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంపై దృష్టి సారిస్తానని ఎంఈఓ శేఖర్ తెలిపారు.అలాగే పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి, బోధన నాణ్యత పెంపు, విద్యార్థుల హాజరు పెంచే దిశగా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన హరిపంతులు

**మర్కుక్, మార్చి 1 (ప్రభాతవార్త):**



మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నాచారం ఆలయ మాజీ చైర్మన్ హరిపంతులు కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను ఆదివారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మండల మాజీ ఎంపిపి పాండుగౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా హరిపంతులు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ పరిధి ముట్రాజ్‌పల్లి రోడ్డులో గల వైష్ణవి గార్డెన్‌లో తన కుమార్తె వివాహం జరుగనుండగా వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కెసిఆర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే వివిధ పార్టీల పెద్దలకు, పలువురు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పలికినట్లు తెలిపారు.

## ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షునిగా లింగ శేఖర్

**వర్గల్, మార్చి 1 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలం నెంటూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా లింగ శేఖర్, ఉపాధ్యక్షునిగా కిచ్చుగారి పాండులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లింగ శేఖర్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు.



## మోడల్ ఐక్యరాజ్యసమితి పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

**మనోహరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్లకల్‌లో 9వ తరగతి ఇద్దరు విద్యార్థులు సమీక్ష, ఐశ్వర్యలు మోడల్ ఐక్యరాజ్య సమితి పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి గైడ్ టీచర్లుగా సోషల్ ఉపాధ్యాయులు స్వరూప రాణి, కవిత ఉన్నారని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల కార్యక్రమాల్లో భాగంగా సోషల్ ఫోరం సహకారంతో మోడల్ ఐక్యరాజ్యసమితి పోటీలు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి విజయ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ భవన్లో నిర్వహించారు. విద్యార్థులు 56 దేశాల ప్రతినిధులుగా, అంతర్జాతీయ జర్నలిస్టులుగా చర్చల్లో పాల్గొన్నారు. వీరిలో 11 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరు విద్యార్థులు మన పాఠశాలకు చెందినవారు కావడం పట్ల జిల్లా విద్యాధికారి విజయ అభినందించినారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థుల దృశ్యం.



సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా రవికుమార్

**ఝరాసంగం, మార్చి 1, ప్రభాతవార్త:** మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా మండల పరిధిలోని దేవరంపల్లి సర్పంచ్ పట్లోళ్ల రవికుమార్, ఉపాధ్యక్షులుగా గినియర్‌పల్లి సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరిలను మండల సర్పంచ్‌లు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంత్‌రావు పాటిల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ పులిమామిడిమమత రాజులను సన్మానించిన పోల శ్రీనివాస్ మిత్ర బృందం

**సదాశివపేట,మార్చి 1 (ప్రభాతవార్త):**

పట్టణంలోని గురునగర్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల శ్రీనివాస్,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు మరియు ఇటీవల మున్సిపల్ కౌన్సిలర్ పులిమామిడి మమతను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పోల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి వెళ్లాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానన్నారు.రాజు చేసిన సేవలను సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ మర్చిపోలేరని అన్నారు. అదేవిధంగా సదాశివపేట పట్టణంలో ఉండేటువంటి టీచర్స్ కి మీటింగ్స్ ఏర్పాటు చేసుకొనుటకుగాను ఎటువంటి భవనం లేదన్నారు.సదాశివపేట పట్టణంలోని ఉపాధ్యాయుల కొరకు టీచర్స్ భవన నిర్మాణానికి స్థలాన్ని ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, సోమ శంకర్,పి.ఎం.ఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.



## సిఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరకు సన్మానం

**సదాశివపేట,మార్చి 1 (ప్రభాతవార్త):**

సదాశివపేటలోని సీఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు మరియు కౌన్సిలర్లు అరుణ్ కుమార్, నర్సింలుకు సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రేణుక చిరు మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలోపాస్టర్ గిరి ప్రసాద్, సుధాకర్, ప్రభు, నాగయ్య, శేఖర్, రాజు, సుందర్, ఏసు,రాజు, సామిల్, శంకరయ్య, సత్యం, రాజు, కుమార్, కృష్ణ, శీను, సురేష్, రాజు, స్త్రీల మైత్రి సభ్యులు, సిఎస్ఐ చర్చ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయండి
### -2003 డిఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్

**మర్కుక్, మార్చి 1 (ప్రభాతవార్త):**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్

ఈనెల 7న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న మహా విజ్ఞాపన సభకు డిఎస్సీ 2003 ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని 2003 డిఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రమైన మర్కుక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం 2004 జనవరి 1 నుండి తన పరిధిలో ఉన్న ఉద్యోగులందరికీ కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని, కానీ గత నాలుగు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోని ఉద్యోగులందరికీ 2004 జనవరి 1 ముందు నోటిఫికేషన్ వచ్చి నియామకం ఆలస్యమైన ఉద్యోగులందరికీ 57/4 మరియు 57/5 ఉత్తర్వుల ఆధారంగా తమ పరిధిలోని ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేస్తుందని, అదే విధానాన్ని రాష్ట్ర ఉద్యోగులందరికి కూడా వర్తింపజేయాలని సుప్రీంకోర్టు తెలియజేసిందని తెలిపారు.దేశంలో ఇప్పటికే 16 రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన 57 జివో అమలు చేశాయి కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడంతో గత సంవత్సరం జులై 29న రాష్ట్ర హైకోర్టు 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ వచ్చి ఆ తర్వాత నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని, దీనికి నిరసనగా ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద మహా విజ్ఞాపన సభను నిర్వహిస్తున్నామని, ఈ సభకు గజ్వేల్ డివిజన్ పరిధిలోని 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బాలకిషన్, నాగరాజు ఉన్నారు.

## జ్ఞానానికి మార్గదర్శిశంకరాచార్యులు
### -5న బర్దీపూర్‌లో విగ్రహావిష్కరణ

**ఝరాసంగం, మార్చి 1, ప్రభాతవార్త:** సనాతన ధర్మ పరిరక్షణలో విశిష్ట స్థానంలో ఉన్న జగద్గురు ఆదిశంకరాచార్యులది భారతీయ



విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దత్తగిరి మహారాజు

ఆధ్యాత్మిక లోకంలో చిరస్థాయిగా నిలిచుంటారని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామని 1008 అవదూత గిరి మహారాజ్ (అప్పగారు) అన్నారు. ఈ నెల 5 తారీఖున దత్తగిరి మహారాజ్ అమరతిథిని పురస్కరించుకుని ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమం గోడపత్రికను ఆదివారం ఆశ్రమంలో ఆవిష్కరించారు. భారత దేశంలోని ఆయా ప్రాంతాల్లోని దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆది శంకరాచార్యులకు సంబంధించి 108 విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ పేర్కొన్నారు. ఈ నెల 5న బర్దీపూర్‌లో ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర రాజనర్సింహ హాజరుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, శ్రీ కేతకి ఆలయ కమిటి మాజీ చైర్మన్ నీలా వెంకటేశం గుప్తా, నాగన్న పాటిల్, అంజన్న, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సే రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష్యం
### నియోజకవర్గ ఇన్‌చార్జి : హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, మార్చి 1, ప్రభాతవార్త :**

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని తడ్కపల్లి గ్రామానికి చెందిన రైతులు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల



తడ్కపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు విన్నవించారు. వెంటనే స్పందించిన హరికృష్ణ విద్యుత్ అధికారులతో మాట్లాడి గ్రామానికి 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించిన హరికృష్ణకు గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు తడ్కపల్లి మహేష్, పర్శరాములు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి
### సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామిగౌడ్

**కొమురవెల్లి, మార్చి 1, ప్రభాతవార్త :**

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామిగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని రసూలాబాద్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై సారధి కళా ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత సోషల్ మీడియకు దూరంగా ఉండాలన్నారు.యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే పోలీస్ టోల్ ఫ్రీ నంబరు 100కు ఫోన్ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి, జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో సాంస్కృతిక సారధి కళాబృందం సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, గంజాయి నియంత్రణ పై కళాకారులు ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రోళ్ల సుదర్శన్, మాజీ సర్పంచ్ స్వామిగౌడ్, వార్డు సభ్యులు బహుదూర్, రాధిక కిరణ్, అబ్దుల్లా నర్సయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, సారధి టీం బృందం పిల్లిట్ల శ్యామ్ సుందర్, పిన్నింటి రత్నం, కనకయ్య, హరిప్రసాద్, శ్రీనివాస్, ప్రకాష్, సిద్దులు, భిక్షపతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి సమక్షంలో బిజెపిలో చేరికలు

**హత్నూర మార్చి 1,ప్రభాతవార్త :**

హత్నూర మండలం సాదుల్ నగర్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు, గ్రామస్తులు ఆదివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారని హత్నూర మండల బిజెపి శాఖ అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్ తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు వారికి బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరియు అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమములో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజమల్లారెడ్డి, చందాపూర్ సర్పంచ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**వర్గల్, మార్చి 1 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో ఈనెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం శ్రీమాన్ శ్రీశ్రీశ్రీ త్రిదిండి దేవనాథ జీయర్ స్వామి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలకు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రంగాచారి, సహాయకులు సుధాకర్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉప ప్రధాన అర్చకులు వి.కృష్ణమాచార్యులు, పురోహితులు గోపాలకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ దేవనాథ జీయర్ స్వామికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం



కళారత్న అవార్డు గ్రహీత శంకర్‌నారాయణను సన్మానిస్తున్న దృశ్యం

## విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా పురస్కారాలు

**గజ్వేల్, మార్చి 1 (ప్రభాతవార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత, స్వరకర్త, గాయకుడు విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యుల సహకారంతో వారి మాతృమూర్తి కీర్తిశేషులు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆదివారం గజ్వేల్‌లో వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తునికి ఉమారాణి విద్య, డాక్టర్ దూబకుంట మంజుల, పెండ్యాల భార్గవి మహేష్, కొత్త ముక్తాబాయ్, సుధారాణి కృష్ణంరాజు, షేర్ల నాగలక్ష్మిలకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా శ్రీవాణి రోహిత్ వ్యవహరించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కళారత్న అవార్డు గ్రహీత శంకర్‌నారాయణ, విశిష్ట అతిథులుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర గొప్పదని, వారు అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్తున్నారని అన్నారు. విశ్వేశ్వరరావు మంజుల మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్‌గుప్తా, లయన్ నేతి శ్రీనివాస్, వసంత, అరుణ, రాజేశ్వర్, దివాకర్‌రావు, శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రావు, రోహిత్, రవీందర్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




పోసానిపల్లిలో పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిష్టయ్య

## పోసానిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

**చౌటకూరు, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోసానిపల్లిలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపిడిఓ కె శంకర్‌లు పాల్గొని ప్రజలకు పౌర హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పౌర హక్కులను పరిరక్షిస్తూనే మరో వైపు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి సమానత్వం, స్వేచ్ఛా, మత స్వేచ్ఛ, సాంస్కృతిక విద్యా హక్కులను రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె రేణుక బాలరాజ్, ఆర్ఐ ప్రమోద్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి సుకన్య తదితరులు పాల్గొన్నారు.




జరిగిన ఏం బాజా సే ఫైనల్ బగ్గీ వాహనాల పోటీలో విజేతలైన వారికి బహుమతులు అందజేసిన ప్రతినిధులు

## విజయవంతంగా ముగిసిన మెకానికల్ బాజా సే ఇండియా 2026 ఫైనల్ రేసింగ్ బగ్గీల పోటీలు

**నర్సాపూర్, మార్చి 01 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా నర్సాపూర్ లోని బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా జరిగిన “ఈ బాజా సే ఇండియా 2026బగ్గీల పోటీలు” ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యా అతిధిగా మెదక్ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ శ్రీ సి.ఎస్. మహేందర్ గారు హాజరయ్యి ఆయనమాట్లాడుతూ బాజా సే ఇండియా పోటీలలో పాల్గొంటున్న టీమ్స్ కి అభినందనలు తెలియచేశారు. విద్యార్థులు సంతోషముగా క్రేడా స్ఫూర్తి ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం పోటీలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు

ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎద్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీ ఆదిత్య విస్సం గారు జాయింట్ సెక్రటరీ శ్రీ సాయి సుమంత్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఇటువంటి పోటీలు నిర్వహిండం ప్రథమమని అటువంటి పోటీలు 2024, 2025, 2026 వరుసగా మూడు సార్లు నిర్వహించబడిన ఘనత నర్సాపూర్ పివిఆర్ఐటి ఇంజనీరింగ్ కాలేజీకి దక్కుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులకు అల్ ది బెస్ట్ చెప్పటం జరిగింది.బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే ప్రధానఉపన్యాసంలో మాట్లాడుతూ తమ కళాశాలలో జాతీయ స్థాయి పోటీలు బాజా పోటీలు నిర్వహించటం యిది మొదొవసారి అని మా శ్రీ విష్ణు ఎద్యుకేషనల్ సొసైటీ చెర్మన్ శ్రీ కె వి విష్ణురాజు గారి దూరదృష్టి కోర్ ఇంజనీరింగ్ యొక్క ప్రాధాన్యతను తెలిపేందుకు గర్వపడుతున్నామన్నారు. ఉద్యోగ అవకాశాలు విద్యార్థులకు పుష్కలంగా వచ్చేందుకు నిరంతరం పరితపిస్తారని వారి ఆలోచన రూపమే నేటి ఈ భారీ ఖర్చుత్తో కూడిన పోటీలు నిర్వహిస్తున్నామని తెలియపరిచారు

ఈ కార్యక్రమానికి అతిధిగా శ్రీ మహేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్, ఒలెక్ట్రా , పాల్గొన్నారు,.డాక్టర్ జి నాగరాజన్, ప్రెసిడెంట్ సే ఇండియా, శ్రీ షుహే కోయెన్, బి 2 బి అమ్మకాలు మరియు మార్కెటింగ్ సలహాదారుడు హెచ్ఐపిపి, మరియు విశిష్ట అతిధిగా శ్రీ శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్ రిటైల్, భారత్ పెట్రోలియం పాల్గొన్నారు వారు మాట్లాడుతూ అన్ని టీమ్స్ కు అభినందనలు చెప్పారు

